సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ప్రొద్దుటూరు మండల పరిధిలోని అమృతానగర్‌లో వంద కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

-IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
కడప	: 6.31	4.54
పులివెందుల	: 6.34	4.49
ప్రొద్దుటూరు	: 6.33	4.58

గరిష్ఠం/కనిష్ఠం
43.4/26.8

వాతావరణం

జిల్లాలో గురువారం 26.8 - 43.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు బలిజల ఆత్మీయ సమావేశం

కడప కార్పొరేషన్: కడప నగరం మద్రాసు రోడ్డులోని వైఎస్సార్ ఆడిటోరియంలో బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు బలిజ సంక్షేమ సంఘం నాయకులు తుమ్మలకుంట శివశంకర్, శివకేశవ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. బలిజ కులస్తులంతా ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

సిబ్బంది నియామకానికి ర్యాండమైజేషన్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది నియామకం కోసం గురువారం కలెక్టరేట్‌లో మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సీపీఓ వెంకట్రావు, డీఐఓ విజయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో 2035 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్రానికి ఆరుగురు చొప్పున 20 శాతం రిజర్వుతో సిబ్బందిని నియమించనున్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమితులైన వారికి ఈనెల 13, 14 తేదీల్లో వారు పనిచేసే అసెంబ్లీ నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సిబ్బంది నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఆయా తహసీల్దార్లకు పంపారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ




మూల్యాంకన కేంద్రంలో సమాధాన పత్రాలను పరిశీలిస్తున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనానికి సంబంధించి సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకుని పేపర్లను మూల్యాంకనం చేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి సూచించారు. గురువారం కడప మున్సిపల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సమాధాన పత్రాల మూల్యాంకనం ఏ విధంగా చేస్తున్నారు, మార్కులను ఏ విధంగా వేస్తున్నారు.. టోటల్ మార్కులను ఖచ్చితంగా వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మార్కుల విషయంలో ఏ విద్యార్థికి అన్యాయం జరగకూడదని సిబ్బందికి సూచించారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని పత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు. మూల్యాంకనంలో భాగంగా గురువారం 31,297 సమాధాన పత్రాలకు మూల్యాంకనం జరిగినట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేష్ తెలిపారు. ఆర్‌జేడీ వెంట డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు రాజగోపాల్‌రెడ్డి, క్రిష్ణప్రసాద్, కడప ఎంఈఓ పాలెం నారాయణలు ఉన్నారు.

'పది' విద్యార్థులకు ఐఐటీ, నీట్ శిక్షణ

కడప ఎడ్యుకేషన్: కడపనగర పరిధిలో ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసుకుని తెల్లరేషన్ కార్డు కలిగిన విద్యార్థులకు సూపర్-30 పేరుతో ఐఐటీ, నీట్ కోర్సులకు సంబంధించిన ఫౌండేషన్ కోర్సులకు ఉచితంగా కోచింగ్‌లను ఇవ్వనున్నట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. గురువారం కడప మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి పాస్ అయిన ప్రభుత్వ పాఠశాలలో చదివి తెల్లరేషన్ కార్డు కలిగిన విద్యార్థులకు ఇంటర్ తర్వాత నిర్వహించే నీట్, ఐఐటీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఇప్పటి నుంచి రెండేళ్లపాటు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి కోర్సుకు 30 మంది చొప్పున రెండు కోర్సులకు 60 మంది విద్యార్థులను రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేస్తామని వివరించారు. ఈ కోర్సుల ప్రవేశాల కోసం నగరంలోని ఆయా హైస్కూల్స్‌లో హెచ్‌ఎంల వద్ద ఈనెల 12వ తేదీలోపు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు కోచింగ్ కోసం కడప జయనగర్ కాలనీ బాలికల హైస్కూల్లో కార్పొరేట్ కళాశాలల్లో పనిచేసే నిపుణులైన అధ్యాపకుల చేత కోచింగ్‌ను ఇవ్వనున్నట్లు వివరించారు. వేసవి సెలవుల్లో మాత్రం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జూన్ 12 పాఠశాలలు తెరిచిన తరువాత సాయంత్ర 5 నుంచి 8 గంటల వరకు ఈ కోచింగ్ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు రాజగోపాల్ రెడ్డి, క్రిష్ణప్రసాద్, కడప ఎంఈఓ పాలెం నారాయణ పాల్గొన్నారు.

బాబు ఏడిపింఛెన్





ఈ చిత్రంలో భార్య సాయంతో పెన్షన్ తీసుకునేందుకు మడకలవారిపల్లె సచివాలయానికి వచ్చిన ఈ వ్యక్తి పేరు గడ్డందస్తగిరి. పట్టణంలోని ఆరోగ్యపురంలో నివసిస్తుంటాడు. గత కొన్నేళ్లుగా కంటిచూపు కోల్పోవడంతో ఇంటి వద్దనే వలంటీర్ సాయంతో పెన్షన్ పొందుతుండేవాడు. చంద్రబాబు పుణ్యమా అని వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ నిలిపివేయడంతో సచివాలయం వద్దకు వచ్చాడు. ఇలా తీసుకునేందు కు చాలా కష్టమవుతుందని, తమలాంటి వారిని ఇబ్బంది పెట్టడం మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశాడు.



సంబేపల్లె మండలం శెట్టిపల్లె సచివాలయం పరిధిలో పింఛన్ కోసం వృద్ధురాలి అవస్థ

- పింఛన్ కోసం వెళితే ప్రాణంమీదికొస్తోంది
- ఎండలకు బైటకు వెళ్లకూడదని వైద్యుల సూచన
- పింఛన్ కోసం వెళ్లకు తప్పని పరిస్థితి
- పింఛన్ల పంపిణీ 90.07 శాతం నమోదు

కడప రూరల్: పండుటాకులపై చంద్రబాబు తన కక్షనంతా చూపిస్తున్నారు. ముదిమిమీద పడిన వయసులో వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అవును మరి..పింఛన్ కోసం వెళ్తున్న వృద్ధులు సొమ్ము తీసుకోకనే సొమ్మసిల్లిపోతున్నారు. సింహాద్రిపురం మండలం లోమడ గ్రామానికి చెందిన 70 ఏళ్ల నారాయణమ్మ పింఛన్ కోసం సచివాలయానికి వెళుతూ ఎండ దెబ్బకు సొమ్మసిల్లిపోయింది. ఆమెను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే జిల్లా వ్యాప్తంగా పలువురు పింఛన్ కోసం వెళుతూ అస్వస్థతకు గురవుతున్నారు. ఓ వైపు వడగాలులకు వృద్ధులు బైటకు వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు. అయితే పింఛన్ సొమ్ము కోసం వెళ్లి సొమ్మసిల్లిపోతున్నారు.



పింఛన్ కోసం వృద్ధుడి అగచాట్లు

చంద్రబాబు నిర్వాకం కారణంగా...

సీనియర్ నాయకుడిని అని చెప్పుకొనే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం అందరితో చేతులు కలుపుతున్నారు. 'అధికారం లేకుంటే నేనుండలేను' అనేలా వ్యవహరిస్తున్నారు. అందుకోసం ఎందాకైనా వెళ్తున్నారు. ఆ క్రమంలోనే వలంటీర్లపై పడ్డారు. ఆఖరికి పండుటాకులు అనే కనికరం కూడా లేకుండా పింఛన్లపై పగపట్టారు. ఫలితంగా ఎన్నికల కమిషన్ ప్రజలకు సేవలు చేసే వలంటీర్లను విధులకు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టింది. ఆ ప్రభావం అవ్వాతాతలపై తీవ్రంగా పడింది. బైట నిప్పులను కురిపించే ఎండలు. ఈ మండుటెండల్లో పింఛన్ కోసం పండుటాకులు బైటకు అడుగుపెట్టి, ఎండ దెబ్బకు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు.



లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల సచివాలయానికి పింఛన్ కోసం వృద్ధుడిని తీసుకొస్తున్న బంధువులు

సచివాలయ సిబ్బంది ఒంటరి పోరాటం...

జిల్లా వ్యాప్తంగా 639 సచివాలయాలు ఉన్నాయి. అందులో సిబ్బంది 5,451 మంది. వలంటీర్లు 10,684 మంది ఉన్నారు. విధులకు వలంటీర్లను దూరంగా ఉంచడంతో తక్కువ సంఖ్యలో ఉన్న 5,451 మంది సచివాలయ సిబ్బందే పింఛన్ల పంపిణీలో ఒంటరి పోరాటం చేస్తున్నారు. మొత్తం 2,68,182 పింఛన్లకు గాను రూ.79,31,35,000 పంపిణీ చేయాలి. అందులో భాగంగా రెండవ రోజైన గురువారం సాయంత్రానికి 2,41,556 పింఛన్‌లకు గాను రూ 73,00,91,000 పంపిణీ జరిగింది. దీంతో పింఛన్ల పంపిణీ 90.07 శాతం నమోదైంది.



బద్వేలు: పెన్షన్ కోసం భార్య, మనవడి సాయంతో వస్తున్న వృద్ధుడు



బద్వేలు: మడకలవారిపల్లె సచివాలయం వద్ద పెన్షన్ కోసం వృద్ధులు, దివ్యాంగుల అగచాట్లు



సంబేపల్లి మండలం మోటకట్ల వద్ద పింఛన్‌కోసం చెట్లకింద పడిగాపులు కాస్తున్న వృద్ధులు



బద్వేలులో సచివాలయానికి కర్రసాయంతో వస్తున్న వృద్ధురాలు

'మనూ'లో డిప్లొమా కోర్సుకు అడ్మిషన్లు

పోస్టర్స్‌ను ఆవిష్కరించిన ప్రిన్సిపాల్, సిబ్బంది



సిబ్బందితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను)పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని మను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్ ఖాన్ తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను కళాశాల అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో మే 20 వరకు డిప్లమా కోర్సుకు ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్లికేషన్ పొందవచ్చని వివరించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవ తరగతి (రెగ్యులర్ లేక ఓపెన్)లో ఉర్దూ మీడియంలో లేకపోతే ఉర్దూ సబ్జెక్టు చదువుకుని ఉండాలని సూచించారు. లేకపోతే పాలిటెక్నిక్ రెండేళ్లు, రెండేళ్లు ఐటీఐ లేకపోతే ఇంటర్ చదివి ఉండాలని తెలిపారు. డిప్లమా కోర్సు కోసం ప్రవేశ రాత పరీక్ష జూన్ 12వ తేదీ మధ్యాహ్నం కడప క్యాంపస్‌లో ఉంటుందని తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, అప్పరెల్ టెక్నాలజీ కోర్సులకు ఉన్నాయని చెప్పారు. ఇందులో అబ్బాయిలకు అప్లికేషన్ రుసుం రూ. 550, అమ్మాయిలకు రూ. 350 చెల్లించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం కడప రిమ్స్ వద్ద ఉన్న మను కళాశాలను లేదా https://manuucoe.in/reguleradmission సైట్‌ను సందర్శించి సమాచారం తెలుసుకోవాలన్నారు. అధ్యాపకుల డాక్టర్ మస్తాన్ వల్లి, డాక్టర్ హాకీముద్దీన్, డాక్టర్ అష్రాఫ్ రజా, మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, అబ్దుల్‌కల్వి, సుమ్మత్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

రాయచోటి: ఏపీ పాలిసెట్ ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ తెలిపారు. గురువారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షల నిర్వహణపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను కల్పించాలన్నారు. జిల్లాలోని మదనపల్లి, రాయచోటి, రాజంపేట, కలికిరిలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఎంవీఆర్ వల్లే 'సాగునీటి'పై పట్టు

- మాజీ ఎమ్మెల్యే ఎంవీఆర్ జయంతి సభలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి . చిత్రంలో ఎమ్మెల్యే రాచమల్లు తదితరులు


ప్రొద్దుటూరు: రాయలసీమ ఉద్యమ నాయకుడైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి వల్లే తాను సాగునీటి రంగంపై పూర్తి పట్టు సాధించానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. ఎంవీ రమణారెడ్డి జయంతి సందర్భంగా లింగాపురంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 12 ఏళ్ల క్రితమే ఎంవీఆర్‌తో తనకు పరిచయం ఏర్పడిందన్నారు. ఆ సందర్భంగా ఆయన రాసిన సీమ కన్నీటి గాథలు పుస్తకాన్ని తనకు ఇచ్చాడని తెలిపారు. ప్రపంచ చరిత్ర గురించి కూడా ఆయన పుస్తకాలు రాశారన్నారు. రాయలసీమ వెనుకబాటుతనం గురించి, సాగునీటి రంగం గురించి ఎంవీఆర్ ఎన్నో కలలుగన్నారన్నారు. ఆయన పుస్తకాలు ఎంతో మందికి జ్ఞానాన్ని అందించాయని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 11వేల నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచినందు వల్లే నేడు గండికోటకు, మైలవరానికి, చిత్రావతి రిజర్వాయర్లకు నీరు వస్తోందన్నారు. ఎన్నికల సందర్భంగా తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఎంవీఆర్ ప్రచారం చేశారన్నారు. 2019 ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, తాను గోపల్లెలో ప్రారంభించిన ఎన్నికల ప్రచారానికి ఎంవీఆర్ హాజరై ఆశీర్వదించారన్నారు. జగనన్న ఆయన కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకుంటున్నారన్నారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడు తమ మద్దతు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఎంవీఆర్ అమరుడని అన్నారు. మనిషి లేకున్నా రచయితగా ఆయన రాసిన అక్షరాలతో అమరుడయ్యారన్నారు. రాజకీయాల్లోకి రాకుండా ఉంటే ఎంవీఆర్‌కు ఇంకా పెద్ద స్థాయిలో పేరు ప్రఖ్యాతలు లభించేవని..ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. ఆయన కలం నుంచి సామాజిక స్పృహ కోసం ఎన్నో రచనలు జాలువారాయన్నారు. 2019 ఎన్నికల్లో 50వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని ఆయన చెప్పిన మాటలను తాను మరచిపోలేదన్నారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ ఆర్టీపీపీకి ఎంవీఆర్ ఆర్టీపీపీ అని నామకరణం చేయించినందుకు జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. ఎంవీఆర్ తనయుడు మురళీధర్‌రెడ్డి, మనువడు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలందరూ ఎంవీఆర్ ఆర్టీపీపీకి సహకారం అందించారన్నారు. మాజీ కౌన్సిలర్ మల్లెల ఉమ,. మాజీ వైస్ ఎంపీపీ మల్లెల రాజారాంరెడ్డి, రాజుపాళెం మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో అవినాష్‌రెడ్డి

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, గ్రామ, మండల స్థాయి నాయకులు ఎంపీతో మాట్లాడారు. ఎమ్మెల్యే రాచమల్లు అందరిని పరిచయం చేశారు.రాజుపాళెం మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

పూటకో మాట.. సరికొత్త ఆట!

- అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు సిద్ధమన్న ఆది
- పార్లమెంటుకు పోటీ చేస్తానని చెప్పుకొచ్చిన వైనం
- కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యుల్ని శాంతింపజేసే ఎత్తుగడ
- అనుకున్నట్లుగా సక్సెస్ అయిన జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి
- నేడు టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తల సమావేశం



సాక్షి ప్రతినిధి, కడప: మాటల గారడీతో నేతల్ని బురిడీ కొట్టించే ఎత్తుగడల్లో ఆయన దిట్ట. కలిసివస్తే తన ప్రతిభ.. లేదంటే ఎదుటోళ్ల తప్పుగా వర్ణించే నేర్పరితనం ఆయనది. అనుకున్నట్లుగా అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు. అన్న కుటుంబానికి నాడు-నేడు ఉద్దేశపూర్వకంగా అన్యాయం చేశారని సోదరులంతా పసిగట్టారు. అవకాశవాదానికి అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆగ్రహోదగ్రులయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన చతురత ప్రదర్శించారు. ఒకే ఒక్క స్టేట్‌మెంట్‌తో వ్యవహారాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా ఆది మైండ్ గేమ్‌తో అటు అబ్బాయ్.. ఇటు సోదరులను శాంతింపజేశారు. ఈ నాటకానికి కథ, స్క్రీన్ ప్లే మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కాగా, తారా గణం ఆయన కుటుంబ సభ్యులు కావడం విశేషం.

- జమ్మలమడుగు నియోజకవర్గ రాజకీయాలకు నాలుగున్నరేళ్లుగా మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దూరంగా ఉన్నారు. ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటం చేసిన దాఖలాలే లేవు. తనకు అధికారం అండ లేకపోతే, రాజకీయ మనుగడ కష్టమని భావించి తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతోనే బీజేపీ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి ఉనికి చాటుకునే చర్యలు మినహా ప్రజాక్షేత్రంలో ప్రత్యక్ష పోరాటం చేసింది లేదు. తెలుగుదేశం పార్టీకి దిక్కు దిశా లేని సమయంలో మాజీ జెడ్పీటీసీ భూపేష్‌రెడ్డి రంగప్రవేశం చేశారు. టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి ఆ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించారు. అనుచరులను చేరదీసుకొని ఎన్నికల్లో పోటీ చేయాలని తలచిన నేపథ్యంలో తనను కాదని టికెట్ తెచ్చుకోగలరా? అంటూ ఆదినారాయణరెడ్డి సన్నిహితులు, కుటుంబ సభ్యుల వద్ద వ్యాఖ్యానిస్తూ వచ్చారు. అనుకున్నట్లుగా టీడీపీ టికెట్ భూపేష్‌కు దక్కకుండా వ్యూహాత్మకంగా అడ్డుకున్నారు. ఎన్నికల పొత్తులో భాగంగా బీజేపీకి దక్కేలా తెరవెనుక పావులు కదిపి సక్సెస్ అయ్యారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు


తన సోదరుడు దేవగుడి నారాయణరెడ్డి కుమారుడు భూపేష్‌కు టీడీపీ టికెట్ దక్కకుండా బీజేపీకి దక్కేలా ఆదినారాయణరెడ్డి చేపట్టిన పైరవీలను పసిగట్టిన కుటుంబ సభ్యులు కోపోద్రిక్తులయ్యారని సమాచారం. అందుకు కారణం 2004లో వర్గ రాజకీయాలను కొనసాగిస్తూ వచ్చిన నారాయణరెడ్డికి సీటు లేకుండా అడ్డుతగిలిన వైనం, తాజాగా భూపేష్‌కు ఎమ్మెల్యే టికెట్ దక్కకుండా వ్యవహరించిన తీరుతో దేవగుడి సోదరులంతా ఏకతాటిపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆదినారాయణరెడ్డికి వ్యతిరేకంగా పయనించేందుకు అందరూ సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఆయన బీజేపీ అభ్యర్థిత్వం దక్కినా స్వగ్రామంలో అడుగు పెట్టకుండా ఉండిపోయారు. ఈలోపు భూపేష్‌కు టీడీపీ ఎంపీ టికెట్ దక్కింది. ఆ వెనువెంటనే జమ్మలమడుగు చేరుకున్న ఆది తాను ఎంపీకి, మావాడు భూపేష్ ఎమ్మెల్యే సీటుకు పోటీ చేస్తాం. అదే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాం, పరిశీలనలో ఉందని స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగానే అటు అబ్బాయ్.. ఇటు సోదరులు శాంతించినట్లు సమాచారం. ఆది మైండ్ గేమ్‌కు మొత్తం కుటుంబం ఫ్లాట్ అయినట్లు తెలుస్తోంది.

నేడు ఉమ్మడిగా సమావేశం..

బీజేపీ అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి ఇరువురు శుక్రవారం జమ్మలమడుగులో ఉమ్మడిగా కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జనసేన కార్యకర్తలు సైతం హాజరుకానున్నారు. ఇప్పటి వరకూ బాబాయ్...అబ్బాయ్ ఎవరికి వారు రాజకీయాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఇకపై ఉమ్మడిగా రానున్నారు. వర్గ రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉన్న జమ్మలమడుగులో అవకాశవాద రాజకీయాలు తెరపైకి వచ్చాయి. ఇందుకు దేవగుడి కుటుంబమే ప్రధాన కారణమైంది. ఇలాంటి రాజకీయాలకు ఓటర్లు చెక్ పెట్టాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

భానుడి భగ భగ

గురువారం 43.4 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రత



కడప అగ్రికల్చర్: భానుడు రోజురోజుకు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. గురువారం జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్నాయి. నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. సోమవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా మంగళవారం 42.4, బుధవారం 42.2 డిగ్రీలు నమోదుకాగా గురువారం ఒక్కసారిగా 43.4 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. దీంతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మార్చి 4వ తేదీకే 43 డిగ్రీలు ఉష్ణోగ్రత దాటితే ఇక మే నెలలో పరిస్థితి ఎలా ఉండబోతుందని జనాలు హైరానా పడుతున్నారు. ఎండవేడికి తాళేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


గాయపడిన కార్తీక్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో గురువారం ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఊటుకూరు నుంచి వస్తున్న కార్తీక్ (25) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ఆటోలో ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని..

ముద్దనూరు : మండలంలోని చౌటిపల్లె గ్రామ సమీపంలో గురువారం కారు ఢీకొని స్కూటరిస్టుకు తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల కథనం మేరకు కొండాపురం వైపు బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తిని కారు ఢీకొంది. ఈ ఘటనలో స్కూటరిస్టు కాలు విరిగింది.108 వాహనంలో క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు.

830 గ్రాముల బంగారు నగలు పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : ఎలాంటి ఆధారాలు లేని 830 గ్రాముల బంగారు నగలను వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్‌లు గురువారం సిబ్బందితో కలిసి పట్టణంలోని వాసవి సర్కిల్‌లో వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి నేలటూరు ఉబేదుల్లా కారులో రాగా పోలీసులు తనిఖీలు చేశారు. కారులో 830 బంగారు నగలను పోలీసులు గుర్తించారు. వీటికి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసి ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో పోలీసుల విచారణ వేగవంతం

- 'సిట్' బృందం ఏర్పాటు
- పెండ్లిమర్రి ఎస్ఐ సస్పెన్షన్

కడప అర్బన్/పెండ్లిమర్రి : వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం యాదవాపురానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు (33) హత్య కేసులో జిల్లా పోలీసులు విచారణను వేగవంతం చేశారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఎస్ఐ హత్య కేసు విచారణలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఫిర్యాదు అందడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ వెంకటరాము డి ఆధ్వర్యంలో విచారణను నిష్పక్షపాతంగా, వేగవంతంగా నిర్వహించేందుకు వీలుగా 'సిట్' బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసు లో అనుమానితులుగా ఉన్న వారిపైన 'సిట్' బృందం వారు ప్రత్యేకంగా విచారణ చేపట్టి నిజానిజాలను వెలికితీసి చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు. ఈ సంఘటన అనుమానాస్పద స్థితిలో జరిగిందా? లేక ఎవరైనా హత్య చేశారా? హత్య జరిగి ఉంటే ఎవరు ఈ చర్యకు పాల్పడి వుంటారు? అనే విషయాలపై పరిశీలించి విచారణ చేపడుతున్నారు. త్వరలోనే ఈ సంఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోనున్నారనీ పోలీసు అధికారులు వెల్లడించారు.

పెండ్లిమర్రి ఎస్ఐ సస్పెన్షన్

వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న డి. సునీల్‌కుమార్ రెడ్డి విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేస్తూ కర్నూలు-కడప రేంజ్ డీఐజీ సీహెచ్. విజయరావు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో స్పందించి సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఎస్ఐపై శాఖాపరమైన చర్యలను తీసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వందలాది కుటుంబాలు

ఎన్నికలు సమీపిస్తుండటంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరికల ప్రవాహం కూడా జోరందుకుంది. గురువారం వైఎస్సార్ జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల సమక్షంలో వందలాది కుటుంబాలు పార్టీలో చేరాయి.


మొయిళ్లచెరువు : పార్టీలో చేరిన వారితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలోని అమృతానగర్‌లో వంద కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులై స్వచ్ఛందంగా అనేక మంది పార్టీలో చేరుతున్నారన్నారు. డ్వాక్రా రుణమాఫీ, చేనేత కార్మికులకు ఏటా రూ.24వేలు, అమ్మ ఒడి, బార్బర్ షాపులకు ఉచిత విద్యుత్ లాంటి ఎన్నో పథకాలను పేద, మధ్యతరగతి వారి కోసం ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కరోనా సమయంలో తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించానని తెలిపారు.టీడీపీ నాయకులు ఎక్కడ దాక్కున్నారో అర్థం కాలేదని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ అందిస్తుండగా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేసి పింఛన్ ఇవ్వకుండా నిలిపేశారన్నారు. ప్రస్తుతం పింఛన్ తీసుకోవాలంటే అవస్థలు పడుతున్నారన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ నాడు వైఎస్, నేడు జగన్ ప్రభుత్వంలోనే అమృతానగర్ అభివృద్ధి చెందిందన్నారు. మీరు ఇచ్చిన పదవిని సర్పంచ్ శివచంద్రారెడ్డి రూ.2.50 కోట్లకు అమ్ముకున్నాడని తెలిపారు. మహబూబ్ బాషా, సుభాన్, ఇర్ఫాన్, నిసార్, సలీం, షరీఫ్, వల్లి తోపాటు మాజీ వార్డు మెంబర్ సుబ్బరాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె మండలంలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో గురువారం కమలాపురం పట్టణానికి చెందిన ప్రజా నాయకుడు సాయినాథ్‌శర్మ ఆధ్వర్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో 60కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎంపీ అవినాష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణారెడ్డి, హరికృష్ణారెడ్డి, సిద్దేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, తిరుమలరెడ్డి, సాయి క్రిష్ణారెడ్డితో పాటు మరో 40 కుటుంబాలు పార్టీలో చేరారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వల్లూరు మండలంలో..

వల్లూరు : మండలంలోని గోటూరు గ్రామంలో 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. గోటూరు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గోటూరుకు చెందిన చావలి లక్షుమయ్య, సురేష్, రవి శంకర్, లీలావతి, ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరి సుబ్బయ్య, నాగ సుబ్బయ్య, సుబాష్, సుధాకర్, రాముడు, అంజనమ్మ, అయవారమ్మ, లక్షుమ్మ, గంగమ్మ తదితరులతో బాటు పలు కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వారికి వైఎస్ఆర్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, స్థానిక నేతలు శివకుమార్‌రెడ్డి, రామ క్రిష్ణారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, నిత్యానందరెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు: మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


వల్లూరు మండలం గోటూరులో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

రైతులు వెగా సేవలను వినియోగించుకోవాలి

– కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వెగా సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : రైతులు వెగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సంస్థ అందించే సేవలను వినియోగించుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సంస్థ కార్యాలయాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్నమైన వ్యవసాయ పరిజ్ఞానం కోసం, నాణ్యమైన అధిక వ్యవసాయ ఉత్పత్తుల కోసం వెగా కంపెనీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి రైతు ఆ సంస్థలో సభ్యత్వం తీసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ సంస్థ నుంచి రైతులకు రసాయన కలుషితాలు లేని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పంట సాగుచేసినప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఆ సంస్థ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎం రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ములకలచెరువు : మండలంలోని సోంపల్లె పంచాయతీ చిటిమిరెడ్డిగారిపల్లె సమీపంలోని వేపలబీడు అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి ఎస్ఐ తిప్పేస్వామికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొన్న ఎస్ఐ మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తున్నట్లు చెప్పారు. పంచనామ నిర్వహించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఆచూకీ తెలిస్తే 9440900715 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వృద్ధురాలు అదృశ్యం

మదనపల్లె : వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమో దు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.పట్టణంలోని శేషమహల్ థియేటర్ సమీ పంలో నివసిస్తున్న రామకృష్ణారెడ్డి భార్య గంగులమ్మ (73) మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440796739 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం





తిరుపతి కల్చరల్ : జాతీయ స్థాయిలో 2024–25 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ప్రభంజనం సృష్టించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో పి.గంగా జైదీప్‌రెడ్డి, లాస్య, ఎన్.లిఖిత, పి.ఉదయశ్రీ, జి.లక్ష్మీ, ఎన్.కేతన్ భాస్కర్, ఎన్. జ్యోష్ణ, ఏ.గౌతం కుమార్, హేమంత్, కేథన్ తదితరులతో పాటు 39 మంది విశ్వం విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో నవోదయ పాఠశాలల్లో సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా ఎన్.విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులును విశ్వం విద్యార్థులు సాధిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వేడుకలు


విశ్వనాథరెడ్డి, సత్యనారాయణరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశినాయన : వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పోరుమామిళ్లలోని తన స్వగృహంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథరెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ నియోజవకర్గం నుంచి వచ్చిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఫోన్‌లో విశ్వనాథరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, ఏడు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కారు,బైక్ ఢీకొనడంతో ఒకరు, ఐషర్ వాహనంపై నుంచి కిందపడి మరొకరు మృతి చెందారు.

కారు, బైక్ ఢీ కొని..


మృతి చెందిన చంటయ్య

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు సమీపంలో కుందూనది దగ్గర బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పందిటి చంటయ్య(56) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు..మైదుకూరు మండలం నానుబాలపల్లెకు చెందిన పందిటి చంటయ్య(56)బైక్‌లో వెళుతుండగా ఇదే క్రమంలో కడపకు చెందిన కారు బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంటయ్యను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చంటయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనంపై నుంచి కిందపడి


నగేష్‌రెడ్డి(ఫైల్)

ముద్దనూరు : మండలంలోని కొర్రపాడు గ్రామ సమీపంలో ఐషర్ వాహనం నుంచి కింద పడి క్లీనరు నగేష్‌రెడ్డి(32)అనే యువకుడు మృతి చెందాడు.సీఐ దస్తగిరి కథనం మేరకు అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కలపల్లె గ్రామానికి చెందిన నగేష్‌రెడ్డి ఐషర్ క్లీనరుగా పనిచేస్తున్నాడు.గురువారం చీనీకాయల లోడు కోసం పాత కొర్రపాడు గ్రామ రహదారిలో ఐషర్ వాహనంలో వెనుకవైపున నగేష్‌రెడ్డి ప్రయాణిస్తున్నాడు.ఐషర్ వాహనాన్ని భాస్కర్‌రెడ్డి అజాగ్రత్త నడపడంతో వాహనం గుంతలో పడి ఎగిరింది.దీంతో వెనుకవైపు వున్న నగేష్‌రెడ్డి వాహనంలో నుంచి ఎగిరి కింద పడటంతో అతని తలకు తీవ్ర గాయమైంది.క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో నగేష్‌రెడ్డి మృతి చెందాడు.

టీడీపీ కోసం కార్యకర్తలు త్యాగం చేశారు



ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ కోసం ఎంతో మంది కార్యకర్తలు త్యాగం చేశారని పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. ప్రొద్దుటూరు మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన కూరపాటి రాధ కుటుంబాన్ని గురువారం ఆమె పరామర్శించారు. రాధ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ కార్యకర్తలకు చంద్రబాబు అండగా ఉంటారన్నారు. ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య


రెడ్డి ప్రసాద్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వడ్డెర కాలనీలో నివాసం వుంటున్న పొన్న రెడ్డి ప్రసాద్ (37) అనే వ్యక్తి బుధవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. రెడ్డి ప్రసాద్ కడప నగర శివార్లలోని వడ్డెర కాలనీలో నివాసం వుంటున్నాడు. అతని భార్య సుప్రజ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. తనకున్న రెండు సంవత్సరాల పాపను పుట్టింటిలో వదిలి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న రెడ్డి ప్రసాద్ తాను కూడా కువైట్‌కు వెళ్లాలనీ అనుకుంటున్నట్లు తన తల్లితో పలు మార్లు చెప్పాడు. తన భార్య దూరం కావడంతో మనోవేదనకు గురయ్యాడు. కుటుంబసభ్యులు లేని సమయంలో ఈ చర్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

డెమో రైలు కింద పడి..


మృతిచెందిన ప్రసాద్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌కు కిలో మీటరు దూరంలో నంద్యాల నుంచి కడపకు వస్తున్న డెమో రైలు కింద పడి జమ్మలమడుగు మండలానికి చెందిన పాల ప్రసాద్ (22) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు జమ్మలమడుగు మండలంలోని కొత్తగుంటపల్లె గ్రామానికి చెందిన పాల ప్రసాద్ గత కొంత కాలంగా ఒంగోలులో రొయ్యల ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేసేవాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామమైన కొత్తగుంటపల్లెలో ఉన్న తల్లి వద్దకు వచ్చాడు. వీరు ముగ్గురు అన్నదమ్ములు. చివరి వాడు పాల ప్రసాద్. గురువారం పట్టణంలో పని ఉందని తల్లికి చెప్పి ఇంటి నుంచి టీవీఎస్ మోపెడ్ తీసుకుని రైల్వే స్టేషన్‌కు ఉదయం వచ్చాడు. మోపెడ్‌ను రైల్వే ట్రాక్ ప్రక్కన పెట్టి రైలు వస్తున్న ట్రాక్‌పై ఎదురుగా నిలబడ్డాడు. రైలు వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలు కావడంతో పాల ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. పాల ప్రసాద్ ఆత్మహత్యకు గల కారణాలు ఆర్థిక సమస్యలే కారణం అని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

ఉరి వేసుకుని మహిళ..

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన జాదంసునీత (24) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు ఆమెకు రెండు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు చెందిన జాదంసిద్దులుతో వివాహం చేశారు. భర్త హైదరాబాద్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. అత్త, మాత, భర్తతో హైదరాబాద్‌లో నివాసం ఉండేదని తెలిపారు. తరచూ అత్త, మామ, భర్త సునీతతో గొడవలు పెట్టుకునేవారని, ఈ నేపథ్యంలోనే సునీత భర్త సిద్దులుపైన హైదరాబాద్‌లో కేసు పెట్టిందని తెలిపారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి కొండ్రాజుపల్లె గ్రామానికి వచ్చింది. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతిచెందింది. కాశినాయన ఏఎస్ఐ కాశయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.